క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలో గల జెడ్పీహెచ్‌లో 1990–91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల్లో ఒకరైన సలీం కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు తమ వంతు సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. పూర్వ విద్యార్థులందరూ ఎవరికి తోచినంత విరాళం వేసి రూ.25వేలు, నిత్యావసర సరుకులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో తనను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన స్నేహితులకు సలీం, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయ్య, సుదర్శన్, గోవింద్, బాలరాజు, వెంకట్‌రెడ్డి, శివ, అర్జున్, తాజ్, యుగంధర్, పురేందర్, నాగిరెడ్డి, శేషు, సుమతి, ఖాజా, బూరయ్య, నరేష్, బాలరాజు, భీమన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

వనపర్తి టౌన్: ఇటీవల మృతి చెందిన జక్కుల సుజాత కుటుంబానికి పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి పంపిన రూ.5వేల ఆర్థికసాయాన్ని కాంగ్రెస్ కౌన్సిలర్లు రాధాకృష్ణ, బి.వెంకటేష్ బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో టీమ్మార్ యువసేన నాయకులు నందిపేట తిరుపతియాదవ్, వాకిటి బాలరాజు, కృష్ణయాదవ్ తదితరులు ఉన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించండి


అమరచింత: పట్టణంలోని నాల్గో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విఫలమయ్యారని సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు అబ్రహం, భాస్కర్ అన్నారు. రెండు నెలల కిందట సీసీ రహదారి పనుల కోసం రోడ్డును చదును చేసి వదిలేశారని, ఇప్పటి వరకు వాటిని పట్టించుకోనే వారే కరువయ్యారని వాపోయారు. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు ఇప్పటికైనా నాల్గో వార్డులో నెలకొన్న సమస్యలు, అసంపూర్తి సీసీ రహదారులను వెంటనే నిర్మించి వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్యాంసుందర్, కుతుబ్, రవీందర్, ఎర్రన్న, ఇబ్రాయిల్, సోలు తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అనకాయపల్లితండా గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణం కోసం జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. తండాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం గ్రామ పంచాయతీలుగా గుర్తించారని తెలిపారు. అనకాయపల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం రూ.20లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాందాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



మదనాపురం: మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన అభయాంజనేయ స్వామి విగ్రహ మొదటి వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద వేద పండితులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. హోమం, పారాయణం భక్తిశ్రద్ధలతో చేశారు. స్వామి వారికి గజమాల వేసి పాలాభిషేకం, జలాభిషేకం చేపట్టారు. దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. మహిళలు యువకులు గ్రామస్తులు రాజకీయ ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థికి ఎమ్మెల్యే సన్మానం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన జనుంపల్లి రాజశేఖర్, రజిత దంపతుల కుమార్తె సాత్విక తెలంగాణ ఎంసెట్‌లో 2005 ర్యాంకు సాధించింది. గురువారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి విద్యార్థిని పూలమాల, శాలువాతో సన్మానించారు. రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నాగరాజు, రాజేందర్‌గౌడ్, చంద్రయ్య, రాంలాల్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



ఆత్మకూర్‌లో ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న చైర్‌పర్సన్ గాయత్రి



అమరచింతలో..

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించి అందరూ ఆరోగ్యంగా ఉండాలని పుర చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా 10 వార్డుల్లో పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. చెత్తను బయట పారవేయకుండా చెత్త డబ్బాల్లో వేసి చెత్తబండికి అందించాలని కోరారు.

పాత వస్తువులు అందించండి

మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమవద్దనున్న పాతవస్తువులు, పాతబట్టలు, పాదరక్షలు, బుక్కులు, న్యూస్‌పేపర్లు అప్పగించాలని పురచైర్మన్ గాయత్రి రవియాదవ్, వైస్‌చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కమీషనర్ నాగరాజు, కౌన్సిలర్లు అన్నారు. గురువారం ప్రభుత్వం ఆదేశాలమేరకు ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా 10 వార్డుల్లో శిబిరాలను ఏర్పాటుచేసి పాతవస్తువులను సేకరించారు. పాత వస్తువులు ఇండ్లల్లో నిల్వ ఉండడటం కారనంగా నష్టాలు జరుగుతాయని, పాతసామాన్లు అప్పగించిన వారికి ప్రశంస పత్రాలను అందజేస్తామని పట్టణ అభివృద్ధికి, పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

అమరచింత: స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దటమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అన్ని వార్డుల్లో ప్రభుత్వ ఆదేశాలతో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. పట్టణంలోని ఒకటో వార్డులో గురువారం మేరీలైఫ్, మేరా స్వచ్ఛ్ షహర్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఉన్న పాత వస్తువులు, కాగితాలను, నోటు పుస్తకాలను, పాత బట్టలు, చెప్పులు, పాడైన ప్లాస్టిక్ వస్తువులను స్వచ్ఛందంగా మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత వ్యవహారంలో ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. తడి, పొడి చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించడంలో ప్రజలు సంపూర్ణంగా సహకరిస్తున్నారని, తమ ఇంట్లో ఉన్న పాత పనికిరాని వస్తువులను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్ఆర్ సెంటర్లలో అప్పగించాలని కోరారు.

రాజీవ్‌గాంధీ అంబేడ్కర్ కంటే గొప్పనా..?



కమిషనర్ చాంబర్‌లో సమావేశమై మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్: పట్టణంలో రహదారుల విస్తరణలో భాగంగా ఎప్పటి నుంచో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉన్న దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహన్ని ఉన్న స్థలం నుంచి జరపొద్దని జిల్లా, పట్టణ కాంగ్రెస్ కమిటీలతో పాటుగా అన్ని విభాగాల కమిటీలు మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్‌ను కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో కలిసి ఈ విషయంపై విన్నవిస్తుండగానే స్పందించిన చైర్మన్ గట్టుయాదవ్ రాజ్యాంగ నిర్మాత అయిన అంబేడ్కర్ విగ్రహన్నే జరిపామని, అంత కంటే రాజీవ్‌గాంధీ ఎక్కువా? అని ఎదురు ప్రశ్నించారు. అలా అనవద్దని కాంగ్రెస్ నాయకులు కోరుతుండగానే చైర్మన్ గట్టుయాదవ్ జరిపి తీరుతామని చెప్పడంతో చాంబర్ చైర్మన్ నుంచి వెనుదిరిగారు.

జరిపితే సహించం

రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పక్కకు జరిపితే అధికారులు ఇబ్బంది పడాల్సి వస్తుందని కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డిని హెచ్చరించారు. రాత్రికి రాత్రి జరపాలని చూస్తున్నారని, రోడ్డు ఎంత మేర విస్తరించినా.. ప్రస్తుతం రాజీవ్‌గాంధీ విగ్రహం ఉన్న ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని చెప్పారు. అధికారంలో ఉన్న నాయకుల మాటలు విని రాజీవ్‌గాంధీ విగ్రహం తొలగింపు విషయంలో తొందర పడొద్దని కోరారు. ఈ మేరకు స్పందించిన కమిషనర్ అందరి ఆమోదంతోనే అభివృద్ధికి అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్, కాంగ్రెస్ నాయకులు అక్బర్, అనీస్, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతయ్య, యాదయ్య, ఖమ్మర్ మియా, మధుగౌడ్, జిల్లెల ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సమద్, కోట్ల రవి, బాబా, రోహిత్, వెంకటేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సుపరిపాలన



ఆత్మకూర్ నుంచి తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలతో రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితేనే సుపరిపాలన సాధ్యమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం జడ్చర్లలో జరుగుతున్న పీపుల్స్ మార్చ్ బహిరంగ సభకు ఆత్మకూర్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. బీజేపీ మతత్వపాలనతో అభివృద్ధి కుంటుపడిందని, అందుకే కర్ణాటకలో బీజేపీని చిత్తుగా ఓడించారని.. త్వరలోనే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగాధర్‌గౌడ్, పరమేష్, నల్గొండ శ్రీను, గణేష్ ముదిరాజ్, వినయ్‌రెడ్డి, హరీష్‌గౌడ్, వెంకటన్న, బుచ్చన్న, నర్సింహ, జబ్బార్, మహేశ్వర్‌రెడ్డి, నిరంజన్, గాండ్ల రఘు, ఖాజన్న, మధు, మహిమూద్, సాయిరఘు తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఏపీడీ సయ్యద్ సుల్తాన్

పాన్‌గల్: ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచేలా క్షేత్ర స్థాయిలో సిబ్బంది కృషి చేయాలని ఏపీడీ సయ్యద్ సుల్తాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ (ఎన్ఎంఎంఎస్) యాప్ ద్వారా కూలీల ఫొటోలను పనిచేసే చోటనే తీసి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని, పనులకు వచ్చిన కూలీలకు ఉదయం, సాయంత్రం రెండు పూటల హాజరు నమోదు చేయాలన్నారు. ఇలా చేస్తేనే కూలీలకు ఆ నెలల్లో కూలీ డబ్బులు వస్తాయనే విషయం కూలీలకు తెలియపర్చాలన్నారు. ఒకవేళ ఆన్‌లైన్‌లో రెండు పూటల హాజరు నమోదు కాకుంటే ఆ రోజు కూలీ రాదనే విషయం కూలీలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. త్వరలో ప్రారంభించే హరితహారంలో మొక్కలు నాటేందుకు గ్రామాల వారీగా గుంతలను సిద్ధం చేయాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఏపీఓ కుర్మయ్య పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తికి నుంచి రూ.24 వేల రికవరీ

ఖిల్లాఘనపురం: ఓ వ్యక్తి స్థానిక ఏఎస్ఐని అంటూ మాయమాటలు చెప్పి ప్రజల నుంచి కొట్టేసిన రూ.24 వేలను ఎట్టకేలకు ఖిల్లాఘనపురం పోలీసులు రికవరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్కిమియాన్‌పల్లికి చెందిన కొంకల వెంకట్‌రెడ్డి బ్యాంక్ మిత్రగా పనిచేస్తున్నాడు. 2023 మార్చి 10వ తేదీన అతడికి ఓ వ్యక్తి ఫోన్ చేసి ఖిల్లాఘనపురం ఏఎస్ఐ అశోక్ రెడ్డిని మాట్లాడుతున్నానని తెలిపాడు. నా మిత్రుడు ఆస్పత్రిలో ఉన్నాడు. అత్యవసరంగా రూ.24 వేలు అవసరముంది.. తన నెంబర్‌కు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించండి, నీకు ఆ డబ్బులు మరో వ్యక్తితో పంపుతానని నమ్మబలికాడు. అతని మాటలు పూర్తిగా నమ్మిన వెంకట్‌రెడ్డి డబ్బులు పంపాడు. తరువాత అదే నెబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. మోసపోయానని గుర్తించిన బాధితుడు నేరుగా ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆరా తీశాడు. ఏఎస్ఐ అశోక్‌రెడ్డి అనే పేరుతో అక్కడ ఎవ్వరు లేరని తెలిసిన వెంటనే ఎస్ఐ శ్రీహరికి విషయం చెప్పి 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఉన్నత స్థాయి పోలీసు అధికారులు, బ్యాంక్ మేనేజర్ల సహకారంతో ఎస్ఐ శ్రీహరి విచారణ చేసి కొట్టేసిన డబ్బులను రికవరీ చేసి బాధితుడి ఖాతాలో జమచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవ్వరు కూడ ఓటీపీ, బ్యాంక్ లావాదేవీలు ఇతరులకు చెప్పకూడదన్నారు.

గొల్లకురుమల జోలికి వస్తే ఖబడ్దార్



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కొత్తకోట: గొల్లకురుమల జోలికి వస్తే ఒక్కరిని సైతం వదిలి పెట్టమని, అహంకారంతో మంత్రి తలసాని శ్రీనివాస్‌పై విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డిని సైతం వదిలి పెట్టే ప్రసక్తే లేదని గొర్రెల పెంపకదారుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పెండెం కురుమూర్తియాదవ్ అన్నారు. గురువారం గొల్లకురుమల గాంధీ భవన్ ముట్టడి సందర్భంగా కొత్తకోట చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం గాంధీ భవన్ ముట్టడికి భారీ కాన్వాయ్‌తో హైదరాబాద్‌కు బయలు దేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పెండెం నాగన్నయాదవ్, అవివేల గోపాల్, విష్ణుయాదవ్, ముంత సత్యంయాదవ్, సహకార సంఘం డైరెక్టర్లు కొల్లంపల్లి యాదవ్, నాగేంద్రం, తిరుమల్, భగవంతు, కురుమూర్తి దేవస్థానం డైరెక్టర్ కొల్లంపల్లి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వీరభద్రస్వామి ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో ఈనెల 27వ తేదీ నుంచి మూడు రోజుల పాటు వీరభద్రుడి స్వామి 9వ వార్సికోత్సవ పూజలు ఘనంగా జరుగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. మొదటి రోజు ఉదయం అభిషేకం, యజ్ఞం, స్వామి వారి విగ్రహ ఊరేగింపు, ట్రాక్టర్ రివర్స్‌గేర్, భజన పోటీలు, రెండో రోజు అభిషేకం, బండలాగుడు పోటీలు, మూడో రోజు స్వామి వారి ఊరేగింపు, నందికోలసేవ, అగ్నిగుండం ప్రవేశం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు బండలాగుడు పోటీలకు ఎంట్రీఫీజు రూ.516 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ నిర్వహకులు పేర్కొన్నారు. పేర్ల నమోదుకు పూర్తి సమాచారం కోసం సెల్ నెం.99496 01761, 81870 48094, 93983 71514, 82473 28968, 95057 08096 ను సంప్రదించాలన్నారు.

ఉపాధి కూలీలకు పని చేసే చోటే వేతనాలు

వనపర్తి టౌన్: సేవింగ్, ఐపీపీబీ ఖాతాలతో ఉపాధి కూలీలకు పనిచేసే చోటే వేతనాలు అందుతాయని వనపర్తి పోస్టల్ సూపరింటెండెంట్ దేవిరెడ్డి సిద్దార్థ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కూలీలకు బ్యాంకు ఖాతాలు లేకపోవడంతో వేతనాలు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. తపాల సేవింగ్, ఐపీపీబీ ఖాతాలతో వారి ఇంటి వద్దే (పనిచేసే చోటే) వేతనాలు అందుతాయన్నారు. ఇందుకు అనుగుణంగా డివిజన్‌లో ఉన్న 437 పోస్టాఫీసుల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు అండగా కేంద్ర పథకాలు



ధాన్యం పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పెబ్బేరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నా.. అవి కేంద్రానివని తెలియడం లేదని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆయన గురువారం శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ నెల 30 వరకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పరిపాలన తొమ్మిదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో మూడు సమావేశాలు శక్తి కేంద్రంలో ఒకటి, బూత్ స్థాయిలో మూడు కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ నెల 20నుంచి 30 వరకు గ్రామాల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, విడుదలయిన నిధుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కేంద్రాల్లో తేమ శాతం వచ్చిన ధాన్యానికి ఎలాంటి తరుగు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని వారికి సూచించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామన్న గారి వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు చరణ్, బాల్‌రాజు, రాములు, విష్ణువర్ధన్, జానయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వట్టిపోతున్న సోర్స్ బోర్లు



బీసీ కాలనీలో వట్టిపోయిన బోర్ మోటార్‌ను బయటకు తీస్తున్న మున్సిపల్ సిబ్బంది

- తాగునీటికి తప్పని తిప్పలు
- మిషన్ భగీరథ నీటి కోసం ప్రజల పడిగాపులు

అమరచింత: పట్టణంలోని ప్రజలకు నిత్యం తాగునీటిని అందిస్తున్న 16 సోర్స్‌బోర్లు ప్రస్తుతం వట్టిపోతున్నాయి. సరిపడా తాగునీటిని అందిచలేకపోవడంతో ఆయా వార్డుల్లోని ప్రజలు తాగునీటి కోసం వాటర్ ట్యాంకర్ రాక కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు దాపరించాయి. పట్టణంలోని పది వార్డుల్లో సుమారు మూడు వేల కుటుంబాల్లో 18 వేల జనాభా ఉంది. అమరచింత పంచాయతీగా ఉన్నప్పుడు తాగునీటి కోసం పట్టణంలోని పలు ప్రాంతాల్లో బోర్లను ఏర్పాటు చేసుకోని వాటి ద్వారా వచ్చే నీటిని ఓవర్‌హెడ్ ట్యాంకులకు అందిస్తూ.. కాలనీలకు నీటిని సరఫరా చేసేవారు. మరమ్మతు, ఫ్లషింగ్‌ల కోసం పంచాయతీ నిధులను వెచ్చించి ఇబ్బందులు కల్గకుండా ప్రజలకు నిత్యం తాగునీటిని అందించేవారు. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని ప్రభుత్వం అందిస్తుండటంతో బోర్ల మరమ్మతు, ఫ్లషింగ్‌లకు వీలు లేకుండా పోయింది.



వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న అధికారులు

ఎండిపోయిన 4 బోర్లు

పట్టణంలోని ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన 16 సోర్స్ బోర్లు అనుకున్న విధంగా రోజువారి నీటిని అందించలేక పోతున్నాయి. వీటిలో నాలుగు బోర్లు పూర్తిగా ఎండిపోవడంతో బీసీ కాలనీలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మిగిలిన 12బోర్లు సైతం ఫ్లషింగ్ చేపడితే కాని నీటిని అందించలేమని మున్సిపల్ వాటర్‌మ్యాన్‌లు అంటున్నారు. మిషన్ భగీరథ ద్వారా ఆరు ఓవర్ హెడ్ ట్యాంక్‌లు ఉన్నా.. ప్రజలకు వేసవిలో తాగునీటిని అందించలేకపోతున్నాయి. అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడి తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

అందని 'ఉపాధి' కూలి డబ్బులు



తెల్లరాళ్లపల్లితండాలో చెరువులో ఒండ్రు మట్టి తరలింపు పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

- ఇబ్బందులు పడుతున్న కూలీలు
- పెండింగ్‌లో రూ.15 లక్షలు
- పనుల వద్ద కనిపించని వసతులు

పాన్‌గల్: గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఉన్న ఊరిలోనే పనులు కల్పించి, వలసలు నివారించాలన్న ప్రధాన లక్ష్యంతో ప్రభుత్వం ఉపాధి హామీ పథకం అమలు చేస్తోంది. ఈ పథకం కిందనే ప్రభుత్వం నిర్వహించే అభివృద్ధి పనులు అధిక శాతం చేస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాలను చదను చేయడం, చెరువులు, కుంటలు, బావుల్లో పూడిక తీత, హరితహారం తదితర పనులు ఈ పథకం ద్వారానే నిర్వహిస్తున్నారు. ఈ పనులకు ఎక్కువగా వచ్చేది పేద కుటుంబాలే. వీరికి రోజువారి కూలీ వస్తేనే కుటుంబం గడిసేది. దీంతో వారు చేసే పనులకు వచ్చే కూలీ డబ్బులు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మండలంలోని 28 జీపీల పరిధిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు సంబంధించిన కూలీ డబ్బులు ఐదు వారాలుగా దాదాపుగా రూ.15 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

ఖాతాలల్లో డబ్బులు ఉన్నా..

ఉపాధి పనులకు సంబంధించిన కొంత మంది కూలీల డబ్బులు పోస్టాఫీసు ఖాతాల్లో జమ అయిన ఖాతా 'ఎర్రర్' పేరుతో నగదు డబ్బులను తీసుకోలేని పరిస్థితి. చాలా మంది కూలీలకు సంబంధించిన ఖాతాలు సమస్యలు ఉన్న విషయాన్ని అధికారులకు మొరపెట్టుకున్నా ఆ సమస్యను పరిష్కరించకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడంలేదు. ఇలాంటి ఖాతాలపై అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కూలీలు కోరుతున్నారు.

మండల పరిస్థితి

మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 15,741 జాబు కార్డులు ఉండగా.. ప్రస్తుతం రోజు వారీగా 2,700 మంది కూలీ పనులు చేస్తున్నారు. వీరికి సరాసరి కూలి రూ. 150 పడుతుందని కూలీలు వాపోతున్నారు.

డబ్బులు అందడం లేదు



రోజు వారీ కూలీ సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నాం. పనులు చేసి 7 వారాలు దాటిన మాకు కూలి డబ్బులు రాలేదు. దీంతో కుటుంబం గడవట్లేదు. ప్రభుత్వం ఒక పక్క రోజు వారీ కూలి పెంచామని చెబుతున్నా.. మాకు సగటున రూ. 120 మాత్రమే వస్తుంది. పనుల వద్ద కూడా వసతులు లేవు.– చిన్నమ్మ, ఉపాధి కూలీ, తెల్లరాళ్లపల్లితండా

కూలీల ఇక్కట్లు



పనులు జరిగే ప్రాంతాల్లో కనీస వసతులు నీడ, తాగు నీరు లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. కూలి డబ్బులు సక్రమంగా అందకపోవడంతో పేద కుటుంబాలకు పూట గడవడం కష్టంగా ఉంది.

– కళావతమ్మ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, కేతేపల్లి

జమ చేస్తాం



మండలంలో ఉపాధి కూలీలకు సంబంధించిన డబ్బులు రూ.15 లక్షల వరకు పెండింగ్ ఉన్నాయి. కొన్ని డబ్బులు మంజూరు కాగానే కూలీల ఖాతాల్లో జమ చేస్తాం. పనుల వద్ద వసతుల కల్పనపై మరోమారు సర్పంచ్‌లకు తెలియపర్చి ఏర్పాటు చేసేలా చూస్తాం. కూలీల ఖాతాలో నగదు ఉన్న 'ఎర్రర్' పేరుతో నగదు తీసుకోలేని పరిస్థితి వాస్తవమే. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు నివేదించి సమస్యను పరిష్కారిస్తాం.

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

'అధికారులు ఎందుకు దృష్టి సారించలేదు'

బిజినేపల్లి: కేంద్రం నుంచి వచ్చిన అధికారులు డ్రగ్స్ తయారీ వ్యక్తులను అదుపులోకి తీసుకునేంత వరకు, కూత వేటు దూరంలో ఉన్న ఎక్సైజ్ శాఖ ఏం చేస్తుందని బీజేపీ నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జ్ కొండా నాగేష్ ఆరోపించారు. గురువారం డ్రగ్స్ తయారీ కోళ్లఫారంను వారు సందర్శించి, విలేకరులతో మాట్లాడారు. సంవత్సరం కిందట డ్రగ్స్‌లో జైలుకు వెళ్లిన వ్యక్తిపై అధికారులు ఎందుకు దృష్టి సారించలేదని, నెలకు రూ.3 కోట్ల డ్రగ్స్ దందా జరుగుతుంటే అధికార యంత్రాగం ఏం చేస్తుందన్నారు. ఈ విషయమై ఆ శాఖ మంత్రి స్పందించకుంటే వారి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కృపానందం, సుధాకర్, సాదిక్, వెంకటయ్య, రాఘవేందర్‌గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, మంత్రి రాజీనామా చేయాలి

యువత ప్రాణాలతో బీఆర్ఎస్ పార్టీ చెలగాటమాడటం అలవాటుగా మారిందని, మండలంలో డ్రగ్స్ తయారీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుని ఎమ్మెల్యే, మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్ డిమాండ్ చేశారు. మండలంలో డ్రగ్స్ తయారు చేయడం దుర్మార్గమని, ఈ డ్రగ్స్ దందా వెనుకాల స్థానిక బీఆర్ఎస్ నాయకులు హస్తం ఉందని అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఎస్పీ నాయకులు నాగన్న, చెన్నరాములు, పృథ్వీరాజ్, రాంచందర్, బాలనాగులు తదితరులు పాల్గొన్నారు.

'మిగులు భూమిలో చెట్ల పెంపకం ఆపండి'

బిజినేపల్లి: వట్టెం జలాశయ నిర్మాణం కోసం భూమి కోల్పోయిన రైతుల పొల్లాలో జలాశయం బండింగ్‌కు, రోడ్డు పోను మిగిలిని భూమిలో హరితహారం పథకం కింద చెట్లు నాటాలని చేసిన ప్రతిపాదనను అధికారులు నిలిపివేయాలని వట్టెంకు చెందిన భూ నిర్వాసితులు గురువారం డీఆర్‌డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రాజెక్టులో రెండోసారి భూములను రైతులు కోల్పోకుండా చూడాలని, ఈ విషయమై ఇప్పటికే కోర్టును ఆశ్రయించినట్లు కేసు వివరాలను రైతులు మాధవరెడ్డి, రమాదేవి, శ్రీశైలం, శ్రీను వినతిపత్రంలో పేర్కొన్నారు.